పెంపకం



వై. రాంబాబు రాయి

బయట వెన్నెల. బరువైన భోజనం. వాకిట్లో వాలు కుర్చీలో కన్నుమూత పడుతోంది. చప్పుడైతే చూశాను కాసులు ప్రక్కనే నిలబడున్నాడు.

పదేళ్ళవాడు కాసులు. పదునైన బాకు లాంటి వాడు.

"ఏం కాసులూ! భోజనమైందా?" అనడిగాను.

కాసులు తలూపాడు.

"కూచో" అన్నాను. మెట్టుమీద కూచున్నాడు.

"ఏమిటి విశేషాలు?"

ఏం మాట్లాడ్లేదు. ఏదో ఉంది. చెప్పడానికి భయపడుతున్నాడు.

"భయంలేదు. చెప్పు కాసులూ!"

నన్ను చూశాడు తలవాల్చుకున్నాడు. తటపటాయించాడు.

'ఏం లేదండీ! బాబయ్య చదవొద్దంటున్నాడు. మీరు చెబితే వింటాడు...."

ఆలోచనలో పడ్డాను. అదేమంత సులభమైన పనిగాదు.

చదువు విలువ అందరికీ తెలీదు. తెలీనివాడు ముందే తోసిపారేస్తాడు.

"పొద్దుట చెప్పేను. ఆరోక్లాసులో చేరతానంటే అగ్గైపోయాడు. ఎగసాయం చెయ్యమంటున్నాడు" అన్నాడు కాసులు, తలవాల్చుకునే.

వాడికి చదువుపైన వున్న మమకారం చూసి ముచ్చటైంది. కాని—రామ్మూర్తి తిక్కమొగుడు. ఒకరు చెబితే వినేరకం కాదు.

నా మీద ఎంతో నమ్మకంతో వొచ్చిన వాడికి వట్టి చేయి చూపించలేను. అవు నంటూ బాధ్యత నెత్తికెత్తుకోలేను. ఇది గొంతునబడ్డ వెలక్కాయవతు.

"చెబుతాలే"

అన్నానేగాని ఆ అనడంలో చెబుతా నన్న ధీమాలేదు. నాలో చెప్పాలన్న కోరికాలేదు పులి గుప్పిట్లో కాసుల పేరుంది. తలచుకుంటే ఒళ్లు పుల కిస్తుంది. అడుగు ముందుకు పడదు.

కాసులు చూశాడు—మళ్ళీ. అతని నమ్మకం చాల్లేదు ఏదో చెబుదామను కున్నాడు. ఏం అనడానికీ తోచలేదల్లే ఉంది

రామ్మూర్తి రెండో కొడుకు కాసులు. పెద్దవాడు పేరయ్య కాసులకంటే వాడు ఘటికుడు. గొప్ప తెలివైనవాడే గాని, కాసులుకున్నంత ధైర్యం వాడికిలేదు

వాడి విషయంలోనూ ఇంతే జరిగింది

అయిదయ్యాక వాడు ఆరులో చేరతా నన్నాడు. రామ్మూర్తి అగ్గిరాముడై పొయ్యాడు

"సదువుకుంటావ్రటా సన్నాసి ఎదవా! సదివి ఏం సేద్దామని. కలకటేరు సేత్తావా — గవన్నరు గిరీ ఎలిగింతావా! సదువు కూడెట్టే పళమైతే సదువుకో. నేనొద్దన్ను. కాని—సదువు మన యింటావంటా లేంది నువ్వు సదువుతేమటుకు వొత్తాదేంటి? ఎర్రోడా! మా తాత మట్టి పిసికేడు. మా బాబు మట్టి పిసికేడు. మనం మట్టిలో పుట్టేవురా! మట్టే మనకి కూడెడతాది"

అంతే. ఆ దెబ్బతో పేర్యయ్య తలకి గుడ్డ చుట్టుకున్నాడు. చేత కర్ర పుచ్చు కున్నాడు. ఉన్న నాలుగెకరాల పొలాన్నీ పుస్తకమనుకున్నాడు అ కలతో అక్ష రాలు రాయడం ప్రారంభించాడు

పేరయ్య పెద్ద తెలివైనవాడు. వయ సుకు మించిన తెలివుందని ఋజువు చేసు కున్నాడు చదువులో తప్పక రాణించే వాడు, ఆ మాణిక్యం మట్టి పనికి వెళ్ళి పోయింది రాచబాటకు మళ్ళవలసినబండి అడ్డదారి తొక్కింది

తలెత్తి చూస్తే కాసులు లేదు

అతనికి అన్న స్థితి చూస్తే భయం వేసినట్టుంది గొప్ప చదువులు వొద్దు — కనీసం నాలుగు ఇంగ్లీషు అక్షరాలైనా ఒంటబట్టకపోతే నడిచే రోజులు కావు మరి

కళ్లు తెరిపిళ్లు పడింది తడవు కాసులే తలపుకు వొచ్చాడు కాఫీనీళ్ళు గొంతులో పడనిచ్చి. రామ్మూర్తికోసం బయలు దేరాను.

మకాంలో మంచంమీద కనిపించాడు. చుట్ట కాల్చుకుంటున్నాడు పాలేరు దూళ్ళ దగ్గిర పేడ తీస్తున్నాడు వాడేనో చేశాడు. రామ్మూర్తి వాడిని దులిపేస్తున్నాడు

నన్ను చూశాడు. చూస్తూనే అనుమా నించాడు అనుమానించినట్టు నిదర్శనంగా నన్ను నిలువునా పరీక్షగా చూశాడు.

పక్కను కూచోమన్నాడు

"ఏం మావయ్యా! ఈ సంవత్సరం



పంటలెలా ఉంటాయ్'' అనడిగాను— కూచుంటూ.

''ఏం పంటల్లేవయ్యా అల్లుడా! వాన పడతాదనుకుంటే ఎండ మాడిపోద్ది. ఎండ కావాలనుకుంటే వానలు దంచుతాయి కాలం బాగోపోతే, మనం ఎంత దొళ్ళినా అంటుకోదు.'

అదృష్టం అంటూ ఒకటుండాలి అది కలిసిరాకపోతే. ఎంత తన్నుకున్నా అంతే మరి.

''అది సరేగాని — నువ్వెందుకొచ్చినట్టు?'' అనడిగాడు రామ్మూర్తి

ఉక్కులు చూశాను సూటిగా అడిగితే ఏం చెప్పను!? అయినా తప్పదు మెల్లగా చెప్పాను

రామ్మూర్తి నావొంక చూళ్ళేదు పాలేరు తనపని ముగించుకొని వెళిపోయాడు పాలు పితకడానికున్నాడు రామ్మూర్తి.

నాకేం సమాధానం రాలేదు అలాగే కూచున్నాను.

పాలధారలు చెంబులో పడి రాగాలు పాడుతున్నాయి గేదె మౌనంగా నిలబడింది. దూడ జాలిగా చూస్తోంది నోరు లేని జీవాలు మనిషి ఆకలిని తీరుస్తున్నాయి.

పాలు పితకడం అయిపోయింది

''నడవ్వయ్యా!' అన్నాడు రామ్మూర్తి.

దారిలో అతను నోరు విప్పలేదు. ఇల్లొచ్చింది ఇంక శలవు తీసుకోవాలి.

''మరి నే వెళ్ళొస్తాను మావయ్యా!''
అన్నాను

రామ్మూర్తి వెనక్కి చూడలేదు నా మనసు చివుక్కుమంది ఆలోచనలో

ఉన్నాదేమో! నాకు అవుననిగాని కాదని గాని సమాధానం చెప్పలేను. గబగబ అడుగులు వేసేను.

ఆ రోజంతా కాసులుగురించే ఆలోచన. ఏంచేయాలి? ఏంచేస్తే బావుంటుంది? అతని చదువుగురించి చెప్పినప్పుడు రామ్మూర్తి నాకేమీ సమాధానం యివ్వక పోడానికి్కారణం ఒక్కటే అయ్యుండాలి. కాసులు చదువుకోడం అతని కిష్టం లేదు. నా అంతటివాడు ఈ విషయంలో సలహా యిచ్చినపుడు అతను ఆలోచనలో మునిగిపోయాడు

ఆ సాయంకాలం కాసులు మళ్ళీ వొచ్చాడు. బిక్కమొగంతో ఉన్నాడు. ఒంటిని ఎర్రటివాతలు చూపించాడు. నేను సలహా చెప్పబోతే—దానికి ఫలితం అది.

బావురుమని ఏడ్చేశాడు కాసులు. ఎంతకూ ఊరుకోడు ఒళ్ళో తలపెట్టి, పసిబిడ్డలా వెక్కివెక్కి ఏడ్చాడు. ఏం చెప్పడానికీ తోచిందికాదు. ఏమని సముదాయించను! నే చేసినదానికి ఫలితం ప్రత్యక్షంగా అనుభవిస్తున్నవాడిని ఎలా ఓదార్చడానికీ నోర్రాలేదు.

ఉద్యోగమే ఆధారం నాకు బస్తీ పంతులు నాలుగురాళ్ళు వెనకేయడం సాధ్యంకాదు. పిట్టనుకొట్టి పొయిలో పెట్టడమే అవుతుంది. ఈ స్థితిలో—ఒక కుర్రాడిని ఎక్కడో దూరంగా ఉంచి, చదివించడం నావల్ల కానిపని అయినా సాహసించాను.

బెజవాడలో నా స్నేహితుడున్నాడు. అక్కడికి వెళ్ళిపో. నేను డబ్బు పంపిస్తాను" అన్నాను.

కాసులు ఏడుపు మానేసేడు అయినా ఏం చెప్పలేదు. కాసేపు అలానే కూచున్నాడు. ఏమనుకున్నాడో, చటుక్కున లేచి వెళ్ళిపోయాడు.

రెండురోజులు గడిచిపొయ్యాయి కాసులు కనిపించలేదు.

రాచకార్యం ఒకటి మీదపడి రాజమండ్రి వెళ్ళవలసొచ్చింది. ఒకపట్టాన పనికాలేదు గవర్నమెంటువారితో పనులు అంత జరూరుగా కావని తెలుసు. పూటలో కావలసింది వారమైంది.

తిరిగి వొచ్చేసరికి శ్రీమతి ఒక విచిత్ర వార్త చెవిని వేసింది కాసులు అంతకు రెండురోజులక్రితం ఎటో వెళ్ళిపోయాడు వార్త తెలిసీ తెలీగానే నేను రామ్మూర్తిని చూడాలని వెళ్ళాను.

అల్లంతదూరంలో నన్ను చూసీ చూడనే రామ్మూర్తి ముఖంలో రంగులు మారడం గమనించి, గతుక్కుమన్నాను

నన్ను కూర్చోమనలేదు. మామూలుగానైనా నవ్వలేదు. ఒకసారి ముఖమెత్తి—శత్రువును చూసినట్టు చూసి. "మావోణ్ణి ఎక్కడికి పంపించేవో చెప్పు" అన్నాడు.

దెబ్బతిన్నాను. ఈ పాపం నన్ను చుట్టేసింది.



"నువ్వంటున్న దేవిటో నాకర్థకావడం లేదు" అన్నాను. నిబ్బరించుకుని

"సంగనాపి ఊసులాడకు నీ సలహా లేంది ఆడెక్కడి కెళ్తాడు?"

నాకోపం వొస్తోంది.

"రాజమండ్రినించి ఇదే రావడం కాసులు వెళ్ళిపోయాడని మీ అమ్మాయి చెప్పింది. సంగతేవిటో కనుక్కుందామని వొచ్చాను"

నా సమాధానం రామ్మూర్తికి రుచించలేదు

"ఇదిగోనయ్యో! ఈ కపటనాటకాలు నాదగ్గరాడకు. మర్యేదగా ఆడి ఆసూకీ సెప్పేవా సరేసరి—లేకపోతే పోలీసు రిపోర్టిత్తాను ఏవనుకున్నావో—"

వ్యవహారం ముదిరిపోయింది. అపవాదులకు భయపడే తత్త్వం కాదు నాది

"రిపోర్టిస్తావా—సరే—మని రిపోర్టు చేస్తావో చూస్తాను మర్యాదకోసం నిన్ను పలకరించిపోదామని వొస్తే తప్పంతా నా నెత్తిని పెడుతున్నావ్. రిపోర్టిస్తానంటున్నావుగా—కానీ"

నేనన్నది అంతే. మరి నిలబడలేదు.

• •

ఇన్నేళ్ళ తరవాత కాసులు సంగతి తలచుకుంటే చాలా విచిత్రంగా వుంది.

రామ్మూర్తిని ముసలితనం లొంగదీసింది. ఒక్కమాటలో—అతనిప్పుడు కోరలు తీసిన పులి.

ఎప్పుడూ ఇంటరుగుమీద కూచునుంటాడు.

రత్నంలాటి పెద్దకొడుకు ఎందుకూ కొరగాని వాడయ్యాడు. అయినింటి ఆడపిల్ల ఆ యింటి కోడలైంది. ఆవిడ షోకులకు ఉన్న ఆస్తి, అత్తవారిచ్చిన తోటా చాల్లేదు. పేరయ్య ఆవిడ కొంగున మూట. ఆస్తి హారతికర్పూరంలా కరగిపోయాక, అతగాడు కూలీనాలీ చేసుకుంటున్నాడు.

రామ్మూర్తి కిప్పుడు వేళకు తిండి దొరకడం కష్టం. చిన్నకొడుకు పరారై పోయాడన్న బెంగతో రామ్మూర్తి భార్య ఒకరాత్రి నూతిలో దూకి. చచ్చిపోయింది.

రామ్మూర్తిని తలచుకున్నప్పుడు నాకెప్పుడూ జాలివిపించదు. అతను నాకేమీ అపకారం చేయలేదు. అతను చేసిందల్లా—రత్నాల్లాంటి ఇద్దరూ కొడుకుల్ని ఎందుకూ కాకుండా చేసుకున్నాడు.

పెద్దవాడు చదువుకుని వుంటే, బాగుపడి ఉండేవాడు. మట్టివి నమ్మకోడం తప్పుకాదు. మట్టికోసం మాత్రం రామ్మూర్తి బంగారంలాంటి జీవితాన్ని మట్టిపాలు చేశాడన్నదే నా బాధ.

కాసులు కల్లువిడిపోవకంలో నా ప్రమేయం ఏమిలేదని స్పష్టమయ్యాక ఓరోజు రాత్రి రామ్మూర్తి నన్ను వెదుక్కుంటూ వొచ్చాడు. క్షమాపణ చెప్పుకున్నాడు. తొందరపడ్డానన్నాడు.

అప్పుడడిగాను రామ్మూర్తిని—"వాడు చదువుకుంటానంటే ఎందుకు ఒప్పుకోలేద'ని.

చదువు మనిషికి అపకారం చేయదు. మనిషిని అది పెద్దవాడిని చేస్తుంది. అంతర్యాన్ని వికసింపచేస్తుంది. తనకు తాను అపకారం చేసుకోకుండా చేస్తుంది. మనసులో మంచితనాన్ని పెంచుతుంది.

రామ్మూర్తి చదువుకోలేదు. అతనికి చదువు విలువ తెలీదు. అతననుకున్నదల్లా— ఉద్యోగంకోసం మాత్రమే చదువని.

అతను చెప్పిన సమాధానం విన్నపుడు తలవాల్చుకున్నాను. అతని సమాధానం మరోసారి తలుచుకోడానికే భయపడ్డాను.

"కొడుకెప్పుడూ తండ్రి చెప్పుచేతల్లో ఉండాలి. నేను చదువుకోలేదు. నాకొడుకు చదువుకుంటే, నామాటింటాడా? ఇనడు. ఊళ్ళేలతానంటాడు. నామీదే పెత్తనం చేస్తాడు. అందుకోసమే చదువుకోవద్దన్నాను'

ఇంత కల్మషం రామ్మూర్తి హృదయంలో ఉందని తెలీదు.

ఏ తండ్రీ ఇంత నికృష్టంగా ఆలోచించడు

ఏ తండ్రీ ఈవిధంగా కొడుకు భవిష్యత్తును కాలదోయడు

రామ్మూర్తి తండ్రిగా తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించలేక పోయాడు.

కాసులు తిరిగిరాలేదు ఏమైపొయ్యాడో తెలీదు కాలం ఎవరికోసమూ ఆగదు కన్నీరుపెట్టేవాడినీ, కడుపునిండినవాడినీ అది కనికరించదు. దాని పని దానిదే

ఒకరోజు సాయంకాలం వార్తాపత్రికలో కాసులు సంగతి తెలిసింది. ఎజన్సీలో అరెస్టయిన విప్లవవాదుల ముఠాలో కాసులున్నాడు

చక్కగా చదువుకుని, సంఘంలో గౌరవంగా బతకాల్సిన కాసులు జీవితంలో దెబ్బతిని, విప్లవవాదయ్యాడు.

పెద్ద కొడుకు తండ్రి చెప్పినట్లల్లా విని, ఎందుకూ కొరగాకుండా పోయాడు.

వాళ్ళిద్దరిదీ ఏ మాత్రం తప్పులేదు. కొడుకుల్ని ఎలా పెంచాలో తెలీని తండ్రిదే ఈ తప్పంతా.

—